సర్కారు దవాఖానాలు పట్టవా..?

మేడ్చల్, శామీర్‌పేట సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్

- అయినా.. వసతులు అంతంతే..
- ఆస్పత్రుల్లో ఖాళీలతో అదనపు భారం
- డాక్టర్లు, సిబ్బంది కొరతతో అవస్థలు
- 300 నర్సుల పోస్టులకు మంజూరు 170
- 3 వేల ఆశ వర్కర్లకు 340 మాత్రమే..
- వేళకు రాని డాక్టర్లు, సిబ్బందితో రోగులకు కష్టాలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రజలకు పూర్తిస్థాయిలో సర్కారు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జిల్లా కేంద్ర, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు తోడుగా కొత్తగా బస్తీ, పల్లె దవాఖానాలు, సబ్ సెంటర్లు ఏర్పాటు చేసినా సంబంధిత వైద్యాధికారుల నిర్లక్ష్యం, స్థానిక ప్రజాప్రతినిధుల పట్టింపు లేని వైఖరితో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. ఈ గ్రామీణ, పట్టణ, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులతో సహా పలు పల్లె, బస్తీ దవాఖానాల్లో ప్రభుత్వ మంజూరుకు అనుగుణంగా డాక్టర్లు, సబ్ స్టాఫ్ పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పత్రుల్లో రోగులకు సకాలంలో వైద్యం అందితేనే కోలుకుంటారు. వైద్య సేవలు అందాలంటే ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది ఉండాలి. కానీ జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రితో సహా ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అలాగే, 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాల్లో ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ఐదు నెలల క్రితం మేడ్చల్, శామీర్‌పేట ఆస్పత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసినా ఇప్పటి వరకు సరిపడా వసతులు, వైద్యులు, సిబ్బందిని నియమించలేదు.



కొరత.. కలత..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా ఆస్పత్రుల్లో మంజూరు పోస్టులను కూడా భర్తీ చేయకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. సర్కారు దవాఖానాల్లో ఖాళీగా ఉన్న డాక్టరు పోస్టులతో సహా పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్ స్టాఫ్, నర్సులు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. జిల్లాలో మూడు వేల మంది ఆశ వర్కర్స్ పని చేయాల్సి ఉండగా, 340 మంది మాత్రమే ఉన్నారు. అలాగే, అప్‌గ్రేడ్ చేసిన మేడ్చల్, శామీర్‌పేట సీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు, 24 మంది స్టాఫ్ నర్సులు, 10 పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సమయ పాలనపై నిర్లక్ష్యం

జిల్లాలోని పలు గ్రామీణ, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమయానికి రాని డాక్టర్లు, సిబ్బందితో రోగులు వైద్య పరీక్షలు, సేవల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. సాధారణ జబ్బులు, జ్వరం, దగ్గు తదితర వాటికి మందులు లభించినా సీజనల్ వ్యాధులకు మందులు లేక రోగులకు ఇబ్బందులు పడుతున్నారు.

రౌండ్ ది క్లాక్ ఆస్పత్రుల్లో..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 24 గంటలు(రౌండ్ ది క్లాక్) ఆస్పత్రులు 12 ఉండగా, ఇందులో నాలుగు ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మరి కొన్నింటిలో ఆలస్యంగా రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రులకు వచ్చిన రోగులకు అవసరమైన మందులు లేకపోవడంతో రోగాలు నయం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

పనితీరూ.. అంతంతే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొందరు డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతో రోగులకు వైద్యం అందడం లేదని తెలుస్తోంది. మేడ్చల్, ఘట్‌కేసర్ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 12 ఉండగా, ఇందులో 11 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నా.. డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ పేర్కొంటున్నా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. ఈ ఆస్పత్రుల్లో మిగతా సేవలు కూడా అంతంత మాత్రంగా అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ముఖ్యంగా కలెక్టర్ ప్రభుత్వ ఆస్పత్రుల మెరుగు కోసం చర్యలతో పాటు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

తూంకుంటలో మల్లికార్జున స్వామి కల్యాణం



శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలో కేంద్రంలో గల మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ కార్పొరేటర్ నర్సింహ

బోడుప్పల్: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందాలని 28వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చీరాల నర్సింహ అన్నారు. బోడుప్పల్ ఎస్సీ బస్తీలో ఆదివారం అనఘా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు రాపోలు ఉపేందర్, చిన్నింగల్ల మహేష్, చిన్నింగల్ల శ్రీకాంత్, డాక్టర్లు భవాని, శ్రీష్టి పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు అలరించాయి. వాగ్దేవి సంగీత విద్యాలయం గురువులు తాడేపల్లి సుబ్బలక్ష్మీ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంగీత కళాకారులు సరిత, పద్మ, హైమావతి, శృతి, జనార్దన్, శ్రీకర్, మౌక్తిక, శ్రీనివాస్ తదితరులు త్యాగరాజ కీర్తనలను ఆలపించారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అరుంధతి ఆస్పత్రి వైద్యులు

అల్వాల్: మచ్చబొల్లారం మార్కెట్ వద్ద అరుంధతి ఆస్పత్రి సహకారంతో సురేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఉత్తమ సేవారత్న అవార్డు గ్రహీత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్ల సురేష్ మాట్లాడుతూ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. నాయకులు సురేందర్‌రెడ్డి, పరమేష్, అతిక్, జావిద్, మహేష్, వినయ్, రాజు, రాజేష్, మధుసూదన్‌రెడ్డి, శ్రీను, సందీప్‌రెడ్డి, సతీష్, బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ ఫ్లాట్ ఓనర్స్ నూతన కమిటీ

అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్ ఏకగ్రీవ ఎన్నిక



అల్వాల్: కానాజీగూడ గ్రీన్ ఫీల్డ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వీఎస్‌రావు రామరాజు, సంయుక్త కార్యదర్శిగా వి.రమణమూర్తి, కోశాధికారిగా యడ్లపల్లి సదాశివరావు, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, సత్యవతి, సత్యనారాయణ, నాగార్జునరావు, అంతయ్య ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఇందుకు సభ్యులంతా సహకారం అందించాలని కోరారు.

క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత

మేడిపల్లి: క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత ఉంటుందని సెజ్ పాఠశాల ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి అన్నారు. సెజ్ పాఠశాలలో మాస్టర్ చరణ్ ఆధ్వర్యంలో ఆదివారం తైక్వాండో టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. గెలుపొందిన వారికి సెజ్ పాఠశాల ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ చైత్ర, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రిన్సిపాల్ గీత, రిపోర్టర్ రాజ్‌కుమార్ మెడల్స్‌ను అందజేశారు. 10 పాఠశాలల నుంచి సుమారు 200మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. తైక్వాండో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్, పలువురు మాస్టర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ మారథాన్

కాప్రా: కుషాయిగూడలోని ఎన్ఎస్ఐసీ బిజినెస్ పార్క్‌లో గెయిల్ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లోథాన్ సైకిల్ మారథాన్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ దేవకాంత్ సిన్హా హాజరై ర్యాలీని ప్రారంభించారు. 5 కిలో మీటర్లు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా దేవకాంత్ సిన్హా మాట్లాడుతూ.. సైకిల్ యాత్ర ఆయిల్ కన్జర్వేషన్ కోసం చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్ తరాల కోసం గ్యాస్, ఆయిల్ తదితర ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు సాయం అందిస్తాం

అల్వాల్: ప్రభుత్వం సహకారం అందిస్తే రాష్ట్రంలో దివ్యాంగులైన ప్రతి విద్యార్థికి విద్యా, వైద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధిలో ముందుడే విధంగా యు వార్డు ద్వారా సాయం అందిస్తామని హెలెన్ కెల్లర్ ఇనిస్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ లయన్ పఠాన్ ఉమర్‌ఖాన్ అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ ఆర్కేపురంలోని హెలెన్ కెల్లర్స్ కళాశాలలో ఆదివారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన యు వార్డు చేస్తున్న ముఖ్యమైన సర్వీస్ యాక్టివిటీని వివరించారు. కార్యక్రమానికి చార్టెడ్ అకౌంటెంట్ మిర్జా మజహార్, హైకోర్టు లాయర్ నిరంజన్ ప్రసాద్, అడికేట్ నటరాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వైభవంగా రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం

అల్వాల్: పురాతనమైన శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానం పాత అల్వాల్‌లో దేవాలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమైంది. బుధవారం వరకు ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందని, త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి చేతులమీదుగా రాజగోపుర ప్రతిష్ఠ ఉంటుంది నిర్వాహకులు తెలిపారు.

ఓయో రూమ్స్ వద్దంటూ ఆందోళన



ఓయో రూమ్స్ తొలగించాలని ధర్నా చేస్తున్న రాంపల్లి షిరిడీ సాయి కాలనీవాసులు

కీసర: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన ఓయో రూమ్స్ వెంటనే మూసేయాలంటూ రాంపల్లిలోని షిరిడీసాయి కాలనీవాసులు ఆదివారం ధర్నాకు దిగారు. వివరాలు.. నాగారం మున్సిపల్ పరిధిలోని షిరిడీ సాయికాలనీలో ఇటీవల ఓయో రూమ్స్‌ను కొందరు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, దీంతో కాలనీలో రాకపోకలు సాగించే కాలనీవాసులు, మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న ఓయో రూమ్స్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఓయో రూమ్స్‌ను తొలగించాలని పోలీసులు, మున్సిపల్ అధికారులకు త్వరలో ఫిర్యాదు చేస్తామన్నారు. కాలనీ అధ్యక్షుడు నరేష్‌కుమార్, సభ్యులు జగన్‌రెడ్డి, గొంగళ్ల కృష్ణ, చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, సాయికుమార్, వెంకన్న, వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు పరిసరాలను శుభ్రం చేసిన భక్తులు



మేడ్చల్: మేడ్చల్ పెద్ద చెరువు అలుగుల వద్ద పేరుకపోయిన చెత్తను కొంతమంది భక్తులు ఆదివారం శుభ్రం చేశారు. అలుగుల వద్ద చెరువు ఒడ్డున పేరుకుపోయిన చెత్తను సంత్ నిరంకారి బాబా భక్తులు శ్రమ దానం చేసి గంటల తరబడి శ్రమించి పూర్తిగా శుభ్రం చేశారు. బాబా జన్మదినం సందర్భంగా ఆయన భక్తులు నడుం బిగించి చెత్త నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ మణికంఠగౌడ్, నాయకులు నర్సింగ్‌రావు, మోనార్క్, నిరంకారి ప్రతినిధులు ఓంకార్, పవన్, మనీష్, పుష్పత్, శంకర్, శర్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీకి సీసీ కెమెరా అవసరం



రాంపల్లి శివాలయం వద్ద సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో గల శివాలయం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నేత, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గండి అంజయ్యగౌడ్ సుమారు రూ.60 వేలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం కీసర ఇన్‌స్పెక్టర్ కస్పరాజు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు పోలీస్ శాఖ నుంచి తమవంతు సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, శివాలయం చైర్మన్, ఏనుగు రామకృష్ణారెడ్డి, మహంకాళి దేవాలయం చైర్మన్ భూమయ్య, నేతలు ఎలిజాల నాగేష్, యాదగిరి, కొండేటి ఎల్లారెడ్డి, రామారం బాలేష్, ఐలేష్, మచ్చ శ్రీనివాస్, వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమల్లికార్జున స్వామివారి కల్యాణం



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో శ్రీమల్లికార్జున భ్రమరాంబిక అమ్మవారి కల్యాణం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి మల్లికార్జున స్వామి, భ్రమరాంబిక అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనంతరం ఒగ్గు కళాకారులు కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పి.రాజుముదిరాజ్, జైపాల్‌రెడ్డి, ఎం.రాజుముదిరాజ్, కార్తీక్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో మౌలిక వసతుల కల్పనకు కృషి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కొకూర్, పంచశీలకాలనీ, ధరణీ ఎన్‌క్లేవ్ కాలనీలవాసులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయ కాలనీల్లో రోడ్ల మరమ్మతులు, తాగునీటి సమస్య, వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయ శాఖల అధికారులకు చెప్పి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నరేష్ మిట్టల్, బస్వరాజు, విజయ్‌వర్ధన్‌రెడ్డి, చంద్రయ్య, దేవేందర్, రవిభూషన్, వెంకట్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ వ్యక్తి కాదు.. ఓ శక్తి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న రాకేశ్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ వ్యక్తి కాదని, ఓ శక్తి అని యూత్ కాంగ్రెస్ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు రాకేశ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ఆదివారం ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని 60 దేశాల రాజ్యాంగాలు చదివి అగ్రగణ్యుడిగా నిలిచాడన్నారు. భారతదేశ కుల, వర్ణ వ్యవస్థ, స్థితిగతులను అనుసరించి మనకు రాజ్యాంగాన్ని అందించారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంబేడ్కర్ రాసిన ఆర్టికల్–3తోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో దాసు, రాందాసు, నర్సింగ్‌రావు, బద్రీ, రాములు, వెంకటేశ్వర్‌రావు, మహేశ్, ఆనంద్, వికాస్, సచిన్, విష్ణు, మధు, ప్రవీణ్, యాకేశ్ పాల్గొన్నారు.

వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులకు త్వరలో బెనిఫిట్స్



గౌతంనగర్: వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులతో కలిసి 30 ఏళ్ల నుంచి చేస్తున్న పోరాటం కొలిక్కి వచ్చిందని, త్వరలోనే వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులకు రావాల్సిన బెనిఫిట్స్ త్వరలోనే అందుతాయని చైర్మన్ మీనా అన్నారు. గౌతంనర్ లోని కాలనీ సంక్షేమ సంఘం భవనంలో వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులతో ఆదివారం ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ పని ముగిసిందని ఎంతో మంది అన్నారని, వెనుకడుగు వేయకుండా సొసైటీలోని కొంత మంది సభ్యుల సహకారంతో కోర్టుకు వెళ్లి హక్కులు సాధించుకున్నామని తెలిపారు. కేంద్ర ఆసరా కమిటీ ప్రధాన కార్యదర్శి కందిబండ సత్యనారాయణ మాట్లాడుతూ వాటర్ డెవలప్ మెంట్ సొసైటీ ఉద్యోగులకు సరైన న్యాయం జరగలేదని కోర్టుకు వెళ్లి వారి హక్కులను సాధించుకునేలా కృషి చేసిన చైర్మన్ మీనాకు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: పేద ప్రజల కోసం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొత్తపల్లి నరేందర్ అన్నారు. మంగాపురం, సాయిబాబా ఆలయంలో కిమ్స్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఆయన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిమ్స్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సామాజిక భావనతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నరేందర్ తెలిపారు. అశోక్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్, దినేష్, రాజేష్ పాల్గొన్నారు.

తలుపు తెరిస్తే.. దండయాత్రే..

అత్వెల్లిలో దోమల స్వైరవిహారం ● చెత్తమయంగా మారిన గ్రామం

అత్వెల్లి.. ఉమ్మడి మేడ్చల్ మండలంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అభివృద్ధిలో అగ్రగామిగా ఉంది. పరిశుభ్రతలో నెంబర్ వన్, అందరూ ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకునే వారు. నేడు ఆ గ్రామం చెత్తమయంగా మారింది. మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనమైనప్పటి నుంచి ఆ గ్రామాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. మున్సిపాలిటీకి చెందిన ఒకటో వార్డు కొంతభాగం, రెండు, మూడవ వార్డులు మొత్తంగా ఉన్నాయి. కౌన్సిలర్లు ఉన్నన్ని రోజులు పరిస్థితి బాగానే ఉన్నా అధికారుల పాలనలో అత్వెల్లి పాతాళానికి వెళ్లింది. – మేడ్చల్



- డంపింగ్ యార్డులే కారణమా..?
- ఫాగింగ్ మరిచిన అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పాత గ్రామం అత్వెల్లి.. ఇంకా గ్రామీణ వాతావరణంలోనే ఉంది. గొర్రెలు, బర్రెలు, మేకలు, ఆవులు, అన్నీ అక్కడ కనిపిస్తాయి. ఎంత అభివృద్ధి చెందినా పల్లె వాతావరణమే కనిపిస్తుంది. కానీ ప్రస్తుతం ఓ గంట పాటు సాయంత్రం వేళలో ఆరుబయట అరుగుపై కూర్చుంటే ఆస్పత్రి పాలు కావాల్సిందే.. దోమల స్వైర విహారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం ఇంటి తలుపులు తెరవాలంటే ఆందోళన చెందుతున్నారు. ఇంటి తలుపులకు మెష్ డోర్లు ఏర్పాటు చేసుకొని ఇంట్లోనే కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దోమలతో పలువురు రోగాలకు గురవుతున్నారు. అత్వెల్లి పరిధిలో జెండా ప్రాంతం, పోస్టాఫీస్, పోచమ్మగుడి, ముస్లిం బస్తీ, ఎస్సీ బస్తీ, పాత గ్రామం, బీసీ బస్తీ, ఎస్టీ బస్తీ ఇలా ఏ బస్తీలో చూసినా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

డంపింగ్ యార్డులే కారణమా..?

మేడ్చల్‌కు చెందిన డంపింగ్ యార్డులు అత్వెల్లి కింది భాగంలో, పైభాగంలో రెండు ఉన్నాయి. పైభాగంలో రైల్వే ట్రాక్ అవతల ఉన్న డంపింగ్ యార్డుతో సమస్య కొద్దిగా తక్కువగా ఉన్నా.. కింది భాగంలో జయదర్శిని వద్ద ఉన్న డంపింగ్ యార్డుతో విపరీతమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, ఆటోల్లో చెత్త తరలిస్తున్నారు. ఈ డంపింగ్ యార్డుల కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి.

ఫాగింగ్ మరిచారా..?

దోమల నివారణకు చేపట్టే ఫాగింగ్ అత్వెల్లిలో ఎక్కడా కనిపించడం లేదు. దోమలతో స్థానికులు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం వారానికి ఒకసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. కౌన్సిలర్లు ఉన్నన్ని రోజులు వారు శ్రద్ధతో ఫాగింగ్ చేయించినా ఆ తర్వాత పట్టించుకునే వారే లేకుండా పోయారు. అధికారులతో పాటు అత్వెల్లిలోని మున్సిపల్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని అత్వెల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డుతోనే దోమల బెడద



అత్వెల్లి కింది భాగంలో ఉన్న డంపింగ్ యార్డుతోనే గ్రామంలో దోమలు వృద్ధి అధికంగా ఉంది. ప్రతి బస్తీలో సమస్య తీవ్రంగా ఉంది. కాసేపు ఇంటి బయట కూర్చోవాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. దోమల కాటుతో ఆస్పత్రి పాలవుతున్నారు. – నర్సింహారెడ్డి, అత్వెల్లి రెండవ వార్డు

ఫాగింగ్ చేయాలి



మున్సిపల్ అధికారులు సిబ్బందితో అత్వెల్లి మొత్తం రోజు విడిచి రోజు ఫాగింగ్ చేయాలి. అన్ని బస్తీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – ప్రేందాస్, అత్వెల్లి మూడవ వార్డు

సమస్యలను తీర్చాలి



అత్వెల్లి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అభివృద్ధిలో అగ్రగామి ఉండేది. మున్సిపాలిటీలో విలీనమైనప్పటి నుంచి అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి అత్వెల్లివాసుల బాధలు తీర్చాలి. – యాదగిరి, అత్వెలి మాజీ సర్పంచ్